# ఇండోసోల్ పరిశ్రమకు భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 10**

ఇండోసోల్ పరిశ్రమకు అవసరమైన భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన పురోగతిపై శుక్రవారం ప్రకాశం భవనంలో జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ డి.హిమవంశి, ఇతర అధికారులతో కలిసి ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. భూములు ఇచ్చేందుకు తొలుత సుముఖత వ్యక్తం చేసి, ప్రస్తుతం ముందుకు రాకపోవడానికి కారణాలపై కలెక్టర్ ఆరా తీశారు. పరిహారం చెల్లింపులో జాప్యానికి కారణాలపైనా చర్చించారు. కాగా, సంబంధిత అంశాలను, ఇప్పటివరకు సేకరించిన భూమి, పెండింగ్ వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ భూయజమానులతో మరోసారి మాట్లాడాలని, అవసరమైతే కంపల్సరీ అవార్డు అమలు చేయాలని చెప్పారు. ఆయా విషయాలపై రాష్ట్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాస్తామన్నారు. ఈ సమావేశంలో భూసేకరణ



డిప్యూటీ కలెక్టర్లు నాగిరెడ్డి, నాసరయ్య, ఇండో సోల్ కంపెనీ కన్సల్టెంట్ ఐవి రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్, ఉలవపాడు తహసిల్దార్



రవిశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణే విద్యార్థికి నిజమైన ఆభరణం

## బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి

## వినూత్న విద్యానికేతన్‌లో అవగాహన సదస్సు

## అర్బన్ సీఐ కె సురేష్




**గిద్దలూరు పెన్ పవర్ జులై 10**

విద్యార్థులు సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వినూత్న విద్యానికేతన్ పాఠశాలలో 'ఆల్ ఇండియా పోలీస్ సహాయోగ్' ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల (డ్రగ్స్) దుష్ప్రభావాల పట్ల విద్యార్థులను అప్రమత్తం చేశారు. ఇలాంటి వాటికి అలవాటు పడితే భవిష్యత్తు అంధకారమవుతుందని హెచ్చరించారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్ అంశంపై అవగాహన కల్పిస్తూ.. ఎవరైనా వేధింపులకు పాల్పడితే భయపడకుండా ఇంట్లోని పెద్దలకు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా పోలీస్ సహాయోగ్ సభ్యులు ఎం. రవిచంద్ర, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.ఏ. ఖాజావలి, డైరెక్టర్లు పి. భూషణ్ రెడ్డి, వై. చంద్రశేఖర్ రెడ్డి, , విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వర్ణ గ్రామ కార్యాలయం తనిఖీ చేసిన ఎంపిడిఓ మోహన్ కుమార్



**గిద్దలూరు పెన్ పవర్ జులై 10**

గిద్దలూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి వి మోహన్ కుమార్ తిమ్మాపురం స్వర్ణగ్రామ కార్యాలయమును ఆకస్మిక తనిఖీ నిర్వహించేశారు. అనంతరం గ్రామంలోని చెత్తనుండి సంపద తయారీ కేంద్రంను తనిఖీ చేసి తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధానం ను పరిశీలించి ఆదాయ సృష్టి కొరకు పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి టిన్ వెంకటరత్నం , స్వచ్ఛ భారత మిషన్ మండల కోఆర్డినేటర్ బాబురావు, స్వర్ణ గ్రామ ఇంజనీరింగ్ సహాయకులు నాగభూషణం మాజీ సర్పంచ్ మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

# విశ్రాంత ఆర్ ఐ నాగర్ బాషా మృతి

**గిద్దలూరు పెన్ పవర్ జులై 10**



గిద్దలూరు పట్టణం శర్మ వీధికి చెందిన రిటైర్డ్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ షేక్ నాగూర్ భాష శుక్రవారం మధ్యాహ్నం 12:30 గంటలకు స్వర్గస్తులైయ్యారు. నాగూర్ బాషా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ గురువారం స్వర్గస్తులైయ్యారు. ఈయన గిద్దలూరు, కోమరోలు రాచర్ల అంతకు ముందు ఒంగోలు పరిసరప్రాంతాలో పనిచేశారు. అప్పట్లో మంచి రెవిన్యూ అధికారిగా పేరు తెచ్చుకున్నారు . నాగూర్ భాష మృతి వార్త తెలుసుకొని పలువురు ప్రముఖులు ఆయన పార్థివ దేహం పై పుష్పగుచ్ఛాలుంచి నివాళులు అర్పించి , కుటుంభ సభ్యులను ఓదార్చారు.

# అమ్మ జన్మనిస్తే... హెల్మెంట్ పునః జన్మనిస్తుంది

## ఎస్సై ప్రేమ్ కుమార్

**వలేటివారిపాలెం పెన్ పవర్, జూలై 10**

అమ్మ జన్మనిస్తే హెల్మెట్ పునః జన్మనిస్తుందని హెల్మెట్ లేని ప్రయాణం యమలోకానికి సోపానమని రహదారి భద్రత మన జీవితాలకు రక్షణ అని స్థానిక వలేటివారిపాలెం ఎస్సై ప్రేమ్ కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం పోలినేనిపాలెం టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు, హెల్మెట్ ప్రాముఖ్యత గురించి ప్రజలను అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ద్విచక్ర వాహన దారులు వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వలన ఘోరమైన రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయి. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కచ్చితంగా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రేమ్ కుమార్ హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది శ్రీనివాసరాజు ఉన్నారు.



# ప్రజల సమస్యలు పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

## అమడసాని బాలకేశవరెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 10**

ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గ్రామ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి అన్నారు మండలంలోని కోవిలంపాడు గ్రామంలో ప్రజల సౌకర్యార్థం వీధిలైట్లను శుక్రవారం కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు, మండల టీడీపీ అధ్యక్షులు బొబ్బూరి రమేష్ సూచనలతో గ్రామ టీడీపీ అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు గ్రామంలోని పలు వీధుల్లో రాత్రి సమయాల్లో వెలుతురు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని సమస్యను గుర్తించి వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారుఈ సందర్భంగా అమడసాని బాలకేశవరెడ్డి మాట్లాడుతూ పంచాయతీలోని వీధిలైట్లు అవసరమైన ప్రాంతాలను గుర్తించి వీధిలైట్లు ఏర్పాట్లు చేస్తున్నామని, గ్రామాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన విషయంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు పంచాయతీలోని ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు అవసరమైన ప్రతి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు పలు వీధులలో వీధిలైట్లు ఏర్పాటు కావడంతో ఆ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో నారాయణ స్వామి దేవస్థాన మాజీ కమిటీ సభ్యులు పాలపర్తి నారాయణరావు, నీటి సంఘం అధ్యక్షులు దొనపాటి మోహన్ రెడ్డి, నాయిడు తిరుపతయ్య, చావా ప్రభాకర్, మాజీ సర్పంచ్ ఎలికా వెంకటనారాయణ, పోలవరపు గురవయ్య, చందలూరి బాలకాశయ్య, కాలువ నరసయ్య, కొమ్మినేని మనోహర్, వాడకొప్పుల సత్యం మరియు గ్రామస్తులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఉగ్రను కలిసిన ఆర్యవైశ్య ప్రముఖులు

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 10**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ శైవ క్షేత్రం, పర్యాటక పుణ్యక్షేత్రమైన భైరవకోనలో ఆర్యవైశ్య అన్నదాన సత్రం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని మండలంలోని ఆర్యవైశ్య ప్రముఖులు కలిసి కోరారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ భైరవకోనకు ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు, పర్యాటకులు విచ్చేస్తున్నారని, వారికి నిత్య అన్నదాన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన సత్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం భైరవకోన పరిసర ప్రాంతాల్లో తగిన స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సానుకూలంగా స్పందించి, త్వరలో భైరవకోనను సందర్శించి పరిస్థితులను పరిశీలించి అన్నదాన సత్రం ఏర్పాటుకు అనువైన స్థలం కేటాయించే అంశాన్ని పరిశీలిస్తానని తెలిపినట్లు ఆర్యవైశ్య ప్రముఖులు తెలిపారు.ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి ఆర్యవైశ్య ప్రముఖులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నదాన సత్రం భైరవకోన ప్రస్తుత కార్యదర్శి సాదు వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య



మండల అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సోమిశెట్టి సుబ్బారావు, గుబ్బ పూర్ణ, టిడిపి మండల మాజీ అధ్యక్షులు గ్రంధి హేమ సుందరం, కాపుగంటి వెంకటేశ్వర్లు, కాపుగంటి ప్రసాదరావు, దర్శి మోహన్రావు, బచ్చు ప్రసాద్, బచ్చు నారాయణ, మారడుగు సుబ్బారావు, మారడుగు నారాయణ, ఏల్చూరి వెంకటరత్నం , రాజు మడుగు ప్రదీప్ కుమార్, దర్శి సత్యం తదితరులు ఉన్నారు.

# ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్వాడీలు






**మార్కాపురం పెన్ పవర్ జూలై10**

ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుండి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకొని అనంతరం ఆర్డీవో కార్యాలయం ముట్టడించి బైఠాయించారు. ఈ సందర్భంగా ఎస్ లక్ష్మి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డికేఎం రఫీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కనీస వేతనం 26,000 వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వేతనాల పెంపుపై అంగన్వాడీలు పలు దఫాలుగా ఆందోళన వ్యక్తం చేసిన ప్రభుత్వం అంగన్వాడీల పట్ల వివక్ష చూపిస్తుందని అన్నారు. పి.ఎఫ్, ఇఎస్ఐ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు అమలు చేయాలని,పెండింగ్లో ఉన్న మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్గ్రేడ్ చేయాలని,హెల్పర్ల ప్రమోషన్ 5 సంవత్సరాలు సీనియారిటీని రద్దు చేయాలని,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. పనిభారం పెంచే నవచేతన యాప్స్ ను రద్దుచేయాలని, పెండింగ్లో ఉన్న టిఏ లు, బిల్లులు వెంటనే ఇవ్వాలని ఆయన కోరారు. అంగన్వాడిలా పోరాటానికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మ బాలనాగయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి సోమయ్య పోరాటానికి సంపూర్ణం మద్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు టి ఆవులయ్య, మాలకొండయ్య, పి రూబెన్,ఎస్.కె అన్వర్, కే సుబ్బరాయుడు, జె నాగరాజు, అంగన్వాడి యూనియన్ నాయకులు ఎస్ లక్ష్మి, ప్రభావతి, రమా, మల్లేశ్వరి, అరుణకుమారి, బి భారతి, డి స్వర్ణ కుమారి, ఏ మునెమ్మ, శోభారాణి, పెద్దక్క,వెంకట శ్రీలక్ష్మి, స్వప్న, భారతి, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# పంటలలో సూక్ష్మ ఎరువు దాతలోప నివారణ చర్యలు




**అర్ధవీడు, పెన్ పవర్, జులై 10**

అర్ధవీడు మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో సుర రాజగోపాల్ రెడ్డి పత్తి పొలంలో సూక్ష్మధాతు లోప నివారణ చర్యలపై డెమో కార్యక్రమం శుక్రవారం నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి జి శివగంగ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్తిలో సహజంగా మెగ్నీషియం దాతులోపం వస్తుందని తెలియజేయడం జరిగింది. దీని నివారణ చర్యలకై ఒక కేజీ మెగ్నీషియం సల్ఫేట్ ను రెండు వందల లీటర్లలో ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమమునకు అవసరమైన ఇన్పుట్ రైతుకు ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి శివగంగ ప్రసాద్ తో పాటు విహెచ్ఎ రంగనాయకులు పాల్గొనడం జరిగింది.

# ఓ ఎస్ డి గా బాధ్యతలు స్వీకరించిన నవజ్యోతి మిశ్రా




**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూలై 10**

జిల్లా నూతన ఓఎస్డిగా నవజ్యోతి మిశ్రా తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి అడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ గా పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. 2021 ఐపిఎస్ బ్యాచ్ కి చెందిన ఈయన స్వస్థలం బీహార్ రాష్ట్రానికి చెందిన వారు.నూతన ఓఎస్డిగా బాధ్యతలు స్వీకరించిన నవ జ్యోతి మిశ్రా ను డీఎస్పీ డాక్టర్ యు నాగరాజు, సీఐ ఎస్ కె అల్తాఫ్ హుస్సేన్ మరియు ఎస్ఐ లు మర్యాద పూర్వకంగా కలసి బొకే అందజేసి అభినందనలు తెలిపారు.

# బిసిల మహా ధర్నా విజయవంతం-జాడి శ్వేత



**గిద్దలూరు, పెన్ పవర్ జులై 10**

రాష్ట్రంలోఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముందుగా ప్రకటించి,హామీ ఇచ్చినట్లుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం విజయవాడలో రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం నిర్వహించిన మహా ధర్నా విజవంతమైందని సంఘ మహిళా ప్రధాన కార్యదర్శి జాడి శ్వేత తెలిపారు. అమరావతి రాజధాని కోసం పార్లమెంటులో కేవలం మూడు రోజుల్లోనే చట్టం చేయించగలిగినట్లే బి.సి రిజర్వేషన్ల అంశంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని మహా ధర్నాలో కోరినట్లుగా తెలిపారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## ప్రైవేట్ పాఠశాల బస్సులపై సంయుక్త తనిఖీలు





**త్రిపురాంతకం పెన్ పవర్ జూలై 10**

విద్యార్థుల భద్రతే లక్ష్యంగా త్రిపురాంతకం మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాల బస్సులపై శుక్రవారం విస్తృత స్థాయిలో సంయుక్త తనిఖీలు నిర్వహించారు. మార్కాపురం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ భాస్కరరావు, త్రిపురాంతకం పోలీస్ స్టేషన్ సీఐ,అస్సాన్, ఎస్సై శివరామయ్య, ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు.పాఠశాలలకు చెందిన బస్సులు మోటారు వాహన శాఖ నిబంధనలను, విద్యార్థుల భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నాయా లేదా అనే అంశాలపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రతి బస్సుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రాలు, పన్నుల చెల్లింపు వివరాలను పరిశీలించారు. డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులు, బ్యాడ్జి చెల్లుబాటు, డ్రైవింగ్ అనుభవం, గతంలో ప్రమాదాల చరిత్ర వంటి వివరాలను కూడా తనిఖీ చేశారు. వాహనాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, ఎమర్జెన్సీ డోర్, భద్రతా హ్యామర్, విద్యార్థుల భద్రతకు అవసరమైన ఇతర పరికరాలు అందుబాటులో ఉన్నాయా లేదా అన్న విషయాలను అధికారులు పరిశీలించారు.అలాగే బస్సుల బ్రేకులు, టైర్ల పరిస్థితి, లైట్లు, ఇండికేటర్లు, సీట్ల అమరిక, కిటికీల భద్రత, వేగ నియంత్రణ పరికరాలు, సీసీ కెమెరాలు, జీపీఎస్ వంటి భద్రతా ఏర్పాట్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించారు. విద్యార్థులను తరలించే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డ్రైవర్లకు సూచించారు. అధిక వేగంతో వాహనాలు నడపకూడదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, వాహన సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించవద్దని హెచ్చరించారు.పాఠశాల యాజమాన్యాలకు కూడా విద్యార్థుల ప్రాణాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించరాదని అధికారులు స్పష్టం చేశారు.ఫిట్‌నెస్ గడువు ముగిసిన వాహనాలను రోడ్డుపైకి తీసుకురావద్దని, అవసరమైన అన్ని ధ్రువపత్రాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు.భద్రతా ప్రమాణాలను పాటించని వాహనాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# జడ్డా వారి వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే తాటిపర్తి



**పెద్దారవీడు పెన్ పవర్ జూలై 10**

పెద్దారవీడు మండల పరిధిలోని బద్వీడు చెర్లోపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన జడ్డా వారి వివాహ వేడుకకు యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివాహ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు జడ్డా కుటుంబ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.కళ్యాణ వేదికపై నూతన వధూవరులను ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాలిరెడ్డి క్రిష్ణారెడ్డి, వైసీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి,మాజీ ఎంపీటీసీ మూల రమాదేవి, ఎంపీటీసీ మూడమంచు రాజారావు, మండల బూత్ కన్వీనర్ ఒద్దుల లక్ష్మిరెడ్డి, బీ చేర్లపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు మాడుగుల వెంకటేశ్వర రెడ్డి ,మండల సోషల్ మీడియా కన్వీనర్ సొంటి నాగార్జున రెడ్డి, మాజీ సర్పంచ్ మూల లక్ష్మిరెడ్డి,బూత్ కన్వీనర్ల పాల్గొన్నారు.

# సర్ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

## మండల తహసీల్దార్ కె. ధర్మ తేజ

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 10**

కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాలలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ కె. ధర్మతేజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, తప్పులులేని విధంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్వోలు) ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉండి ఓటర్ల నుంచి వివరాలు స్వీకరిస్తారని తెలిపారు.పోలింగ్ కేంద్రాల పరిధిలోని అర్హత కలిగిన ఓటర్ల కుటుంబ సభ్యులు రెండు కలర్ ఫోటోలతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఇతర గుర్తింపు కార్డుల జిరాక్స్ ప్రతులను ఎన్యుమరేషన్ ఫారాలతో కలిపి సంబంధిత బిఎల్వోలకు అందజేయాలని సూచించారు. ఓటరు వివరాల సవరణ, కుటుంబ వివరాల ధృవీకరణ వంటి అంశాల్లో ప్రజలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు.మండల కేంద్రం సి.ఎస్. పురం గ్రామానికి చెందిన ఓటర్ల సౌకర్యార్థం బస్టాండ్ సెంటర్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు ఓటర్లు తమ కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు నిర్ణీత సమయంలో సరైన ఆధారాలను సమర్పించని పక్షంలో సంబంధిత ఓట్లు తొలగింపునకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని అర్హత కలిగిన ఓటర్లు తమ ఓటును కొనసాగించుకునేందుకు ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను పాటించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# సర్ ప్రక్రియలో నిబంధనలు తప్పక పాటించాలి

## - జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశం





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 10**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్) ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించకుండా పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన సంతనూతలపాడు, పీర్లవాన్యం సచివాలయాలను సందర్శించారు. వాటి పరిధిలో ' సర్ ' నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించాల్సి వస్తే నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. సంబంధిత కుటుంబ సభ్యుల బంధువులకు/ ఇరుగు పొరుగు వారికి నోటీసుల రూపంలో తెలియజేయాలన్నారు. సంబంధిత ఆధారాలను కూడా భద్రపరుచుకోవాలని చెప్పారు. ఆయా విషయాల్లో స్థానిక బీ.ఎల్.ఏ.ల సహకారం తీసుకోవాలన్నారు. అవసరమైన మేరకు సిబ్బందిని కేటాయించినందున ఆదివారం నాటికే ఈ ప్రక్రియను దాదాపుగా పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఈఆర్వో మాధురి, స్పెషల్ ఆఫీసర్ నిర్మల జ్యోతి, తహసిల్దార్ నారాయణరెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

**నగరంలో జేసీపరిశీలన..:** ఒంగోలు నగరంలో ' సర్ ' ప్రక్రియలో వెనుకబడిన భాగ్యనగర్, రాజీవ్ గృహకల్ప సచివాలయాలను జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి శుక్రవారం తనిఖీ చేశారు. దీనిని వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడు, ఇతర అధికారులు ఉన్నారు.

# సైబర్ నేరాల పై అవగాహన కల్పించిన ఎస్సై ప్రేమ్ కుమార్





**వలేటివారిపాలెం,పెన్ పవర్ జూలై 10**

సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎస్సై ప్రేమ్ కుమార్ అన్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు శుక్రవారం చుండి మోడల్ స్కూల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో సమావేశమై ఈ మధ్యకాలంలో జరుగుతున్న నేరాలు పట్ల, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే అఘుత్యాలు గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి కూడా తమ లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నతమైన స్థానాలను అధిరోహించాలని కోరారు. అనంతరం స్కూల్ పరిసర ప్రాంతాల్లో (100 మీటర్స్ లోపు) ఉండే బడ్డీ కోట్లు వారికి పోగాకు ఉత్పత్తులను ఎట్టి పరిస్థితుల్లో అమ్మరాదని, బహిరంగంగా ప్రదేశాల్లో పొగ తాగారాదని దుకాణ దారులను హెచ్చరించారు. చట్టాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

# పొదిలి ఎంఈఓ బీవీ రెడ్డి కి ఘన సత్కారం



**పొదిలి, పెన్ పవర్, జులై 10**

మండల విద్యాశాఖ అధికారిగా నియమితులైన బివి రెడ్డి కి ఘన సత్కారం జరిగింది. రిటైర్డ్ డిప్యూటీ డిఇఓ ఎం. శ్రీనివాసులు రెడ్డి, స్థానిక తెలుగుదేశం నాయకులు ఎండి గౌస్ శుక్రవారం నాడు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో బీవీ రెడ్డిని కలసి శాలువాతో సత్కరించి, స్వీట్ బాక్స్ అందించారు. తనను సత్కరించి అభినందించిన వారిని ఎంఈఓ బీవీ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ర్యాలీని విజయవంతం చేయాలి -ప్యాప్టో కన్వీనర్ ఆంటోనీ



**సి ఎస్ పురం పెన్ పవర్ జూలై 10**

ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఈ నెల 14న ఎఫ్‌ప్టిటిఓ ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించనున్న జిల్లా స్థాయి ర్యాలీని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కనిగిరి డివిజన్ ప్యాప్టో కన్వీనర్ లక్కీపోగు ఆంటోనీ పిలుపునిచ్చారు.కనిగిరిలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా 12వ పీఆర్సీని తక్షణమే ప్రకటించడంతో పాటు, సీపీఎసన్ను రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 14న ఉదయం 9 గంటలకు ఒంగోలులోని పాత జడ్పీ కార్యాలయం నుంచి చర్చి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రకాశం భవన్ లో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఈ ఉద్యమంలో జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా రంతుల్లా, ఎస్టియు నాయకులు దొడ్డ తిరుపతిరెడ్డి, ఏపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు పి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు వరం సీఎం సహాయనిధి

## కందుల విగ్నేష్ రెడ్డి

**మార్కాపురం పెన్ పవర్ జూలై10**

పేదలకు వరం సీఎం సహాయ నిధి అని టిడిపి యువ నాయకుడు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విగ్నేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మార్కాపురం మండలానికి చెందిన 9మందికి 5,50,032 రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ చెక్కులను లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి విగ్నేష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# నాజియా ఎలాహి ఖాన్ వ్యాఖ్యలపై నిరసన

**గిద్దలూరు, పెన్ పవర్ జూలై 10**

ఇస్లాం ప్రవక్త హజరత్ మహమ్మద్ పై న్యాయవాది, బిజెపి నాయకురాలు నాజియా ఎలాహి ఖాన్ చేసిన చేసిన అనుచిత వ్యాఖ్యలు ముస్లింల మనోభావాలను దెబ్బతీసాయని పేర్కొంటూ గిద్దలూరు నియోజకవర్గ మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం శుక్రవారంనాడు నిరసన తెలిపింది. మత విశ్వాసాలపై తీవ్ర ప్రభావాన్ని చూపే ఇలాంటి వ్యాఖ్యల ద్వారా సామాజిక, మత సామరస్యానికి విఘాతం బకలుగుతుందని బాధ్యురాలిపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. ఆ మేరకు గిద్దలూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు సమర్పించారు.



# రైతులకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యం

## పొదిలి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఇమాంస స్పష్టం



**పొదిలి, పెన్ పవర్, జూలై 10**

రైతులకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పొదిలి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సార్ చెప్పారు. శుక్రవారం నాడు స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో కమిటీ ఆదాయ-వ్య సమగ్ర సమీక్ష సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ ఇమాంస మాట్లాడుతూ మార్కెటింగ్ కమిటీ ఆదాయం పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం పట్టణ శివారులోని అద్ద రోడ్డు ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక చెక్ పోస్ట్ కార్యాలయాన్ని చైర్మన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి. రవిశంకర్ రెడ్డి, కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఫలితాల్లో

# శ్రీ గాయత్రి డిగ్రీ కళాశాల ఘన విజయం

### -96.5 శాతం ఉత్తీర్ణతతో విద్యార్థుల ప్రతిభకు నిదర్శనం






**కందుకూరు, పెన్ పవర్ జూలై 10**

ఆంధ్ర కేసరి యూనివర్సిటీ విడుదల చేసిన నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కందుకూరులోని శ్రీ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు మరోసారి మంచి పేరు తీసుకొచ్చారు అని గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ సిహెచ్ రామకృష్ణారావు తెలిపారు. అన్ని విభాగాల్లో కలిపి 96.5 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషంగా నిలిచింది.విభాగాల వారీగా విద్యార్థులు అత్యధిక మార్కులతో కాలేజీ ప్రథమ స్థానాలు సాధించారు. బీసీఏ విభాగంలో వల్లెపు నాగలక్ష్మి 94.5 శాతం మార్కులతో కాలేజీ ఫస్ట్‌గా నిలిచింది. బీసీఏ విభాగంలో పసుపులేటి మైథిలి 93 శాతం మార్కులతో ప్రథమ స్థానం దక్కించుకుంది. బీకాం (కంప్యూటర్ సైన్స్) విభాగంలో తన్నీరు లక్ష్మీ తిరుపతమ్మ 92.5 శాతం మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, బీఏ (ఎకనామిక్స్) విభాగంలో పడితపు నందిని 89 శాతం మార్కులతో కాలేజీ ఫస్ట్‌గా నిలిచి ప్రతిభ చాటింది. విద్యార్థులు సాధించిన ఈ అద్భుత ఫలితాలపై కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కళాశాల చైర్మన్ సిహెచ్. రామకృష్ణారావు, డైరెక్టర్ సిహెచ్. భరద్వాజ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. గీతా శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ రామకృష్ణారావు మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోటీ ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను అందిస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## సతీష్ వేమన నూతన గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్




**కందుకూరు పెన్ పవర్,జూలై 10**

కడప జిల్లా రాజంపేట లోని విద్యానగర్ కాలనీ నందు తానా మాజీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సతీష్ వేమన నూతనంగా నిర్మించిన గృహప్రవేశ మహోత్సవానికి హాజరై శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. నూతన గృహాన్ని సందర్శించి సతీష్ వేమన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ శ్రీకాంత్ శుభాకాంక్షలు తెలిపారు. వారు ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆకాంక్షించారు.

## సర్ ప్రక్రియ నూరు శాతం విజయవంతమయ్యేలా కృషి చేయాలి

### - ఎమ్మెల్యే దామచర్ల



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 10**

సర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఓటు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో సర్ సర్వే కార్యక్రమం 72% పూర్తయిందని ఇంకా 28% మిగిలి ఉందన్నారు. స్థానికంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీల నాయకులు బిఎల్ఓ లకు డ్యూటీ అధికారులకు సహకరించి ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలాగా చూడాలని అన్నారు. డబుల్ ఎంట్రీలు జాగ్రత్తగా పరిశీలించుకోవాలని తెలిపారు. ఇంకా నాలుగు రోజులే మిగిలి ఉందని స్థానిక పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పూర్తయిందో లేదో తెలుసుకొని పూర్తిగా కాకపోతే వెంటనే వారి అప్లికేషన్లను పెట్టించే విధంగా చర్యలు తీసుకుని అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

## బాల్ బ్యాడ్మింటన్‌లో ద్వితీయ బహుమతి

### అభినందనలు తెలిపిన జిల్లా విద్యుత్ శాఖ ఎస్ ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఒంగోలు ఈ.ఈ. మాకినేని హరిబాబు



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 10**

ఆంధ్ర ప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ బాల్ బ్యాడ్మింటన్ చెస్, క్యారమ్స్ టోర్నమెంట్ 2026- 2027 నెల్లూరు నందు జూలై 7,8,9 తేదీల్లో జరిగాయి. ఈ టోర్నమెంట్లో బాల్ బ్యాడ్మింటన్ ద్వితీయ బహుమతి ఆపరేషన్ సర్కిల్ ఒంగోలు వారు సాధించారు. విజేతలను సూపరింటెండెంట్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు, ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాకినేని హరి బాబు లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు జిల్లా స్పోర్ట్స్ సెక్రెటరీ ఎస్.కె సుభాని, గేమ్ సెక్రటరీ మల్లికార్జునరావు, బాల్ బ్యాట్మెంటన్ టీం ప్లేయర్స్ వై. పున్నారెడ్డి, కె. వీరాంజనేయులు, సి.హెచ్. శ్రీనివాసులు, చెన్నకేశవులు, కె. శ్రీనివాసులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణంలో నాణ్యతను తప్పక పాటించాలి

### - ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు -త్రోవగుంటలోని ఆటో నగర్ లో 10.30 కోట్ల రూపాయలతో జరుగుతున్న రోడ్డు పనుల పరిశీలన




**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 10**

క్వాలిటీలో కాంప్రమైజ్ కాకుండా ఒంగోలు నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ స్పష్టం చేశారు. నగరంలోని కమ్మ పాలెంలో 5.25 కోట్ల రూపాయలతో జరుగుతున్న మెయిన్ రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించి కాంట్రాక్టర్ కు పలు సూచనలు చేశారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, పది కాలాలపాటు ఉండేలా పనులు చేయాలని సూచించారు. అనంతరం త్రోవగుంటలోని ఆటో నగర్ లో 10.30 కోట్ల రూపాయలతో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. మరో రెండు మీటర్లు రోడ్లు వేయాలని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మునిసిపల్ శాఖ మంత్రి నారాయణలను కలిసి ఒంగోలు కార్పొరేషన్ కు నిధుల విడుదల గురించి కోరగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రానున్న మూడేళ్లలో నగరంలోని అన్ని ప్రాంతాల్లో పెండింగ్ లో ఉన్న రోడ్లు, డ్రెయిన్లు పూర్తి చేస్తామని దామచర్ల జనార్ధన్ వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట నగర పాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య, టీడీపీ నగర అధ్యక్షుడు బండారు మదన్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ఆంధ్ర కేసరి వర్సిటీ ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ వివేక డిగ్రీ కళాశాల విజయదుందుభి


### -92 శాతం ఉత్తీర్ణత.. వివిధ కోర్సుల్లో విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు











**కందుకూరు, పెన్ పవర్ జూలై 10**

ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో కందుకూరులోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వివేక డిగ్రీ కళాశాల విద్యార్థులు 92 శాతం ఉత్తీర్ణత సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు వెల్లడించారు. వివిధ కోర్సుల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో సత్తా చాటారు. బీఎస్సీ విభాగంలో పి. విరీష 96 శాతం మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, ఎం. గోవర్ధన్ రెడ్డి 91 శాతం, ఎం. యమున 90 శాతం మార్కులతో ప్రతిభ కనబరిచారు.బీసీఏ విభాగంలో టి. విక్టరీ 94 శాతం, జి. ఎఫ్సిబా 92 శాతం, వి. హేమ 91 శాతం మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారు.బీకాం విభాగంలో వి.వి. శ్రీ మహిత 91 శాతం, కె. ఆశాలత 90 శాతం, డి. సౌమ్య 88 శాతం మార్కులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారు.ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా సంవత్సరంనుంచి అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఏసీసీఏ ఇంటిగ్రేటెడ్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే కళాశాలలో ఎన్‌సీసీ సౌకర్యం అందుబాటులో ఉందని, ఎన్‌సీసీ--సీ సర్టిఫికెట్ పొందిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 15 శాతం రిజర్వేషన్ లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, డైరెక్టర్లు జి. బాల భాస్కరరావు, బి. నరేంద్రబాబు, ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు, అధ్యాపక సిబ్బంది అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల విజయానికి కృషి చేసిన అధ్యాపకులు, తల్లిదండ్రులకు కూడా యాజమాన్యం ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 10**

విద్యుత్ మరమ్మత్తు పనుల కారణంగా శనివారం ఉదయం 6 గం నుండి మధ్యాహ్నం 12 గం వరకు లంబాడిడొంక, సుందరయ్య భవన్ రోడ్డు, అంజయ్య రోడ్డు దుర్గ హాస్పిటల్ వరకు, ఏకలవ్యనగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వి. పాండురంగా రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగ దారులందరులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కు 19 వినతులు

### - జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు



**విశాఖపట్నం, పెన్ పవర్ జూలై 10**

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమంలో 19 వినతులు స్వీకరించడమైనదని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం తన చాంబర్లో సీపీలు, డీసీపీలు, ఏసీపీ లతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ జీవీఎంసీ లో ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న "టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్" కార్యక్రమానికి సంబంధించి 19 వినతులు స్వీకరించడం జరిగినదని, అందులో ముఖ్యంగా మధురవాడ జోన్ కు 05, ఈస్ట్ జోన్ కు 08, నార్త్ జోన్ కు 02, వెస్ట్ జోన్ కు 02, గాజువాక జోన్ కు 02 వినతులు వచ్చాయని తెలిపారు. స్వీకరించిన వినతులను/ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించడమైనదన్నారు. పట్టణ ప్రణాళికా విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమంలో ప్రజలు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

## జాతీయ నృత్య పోటీల్లో సాయి రవీంద్ర పాఠశాల చిన్నారుల ప్రతిభకు ప్రశంసలు

**తగరపువలస, పెన్ పవర్ జూలై 10**

విశాఖపట్నంలోని కళాభారతి ప్రదర్శన మందిరంలో నాట్యరవళి సంగీత నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 37వ అఖిల భారత నృత్య పోటీల్లో తగరపువలసలోని సాయి రవీంద్ర పాఠశాల విద్యార్థులు అద్భుత నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న శ్రీ నృత్యప్రియ అకాడమీలో శిక్షణ పొందిన గంటా వర్షిణి, బండారు కార్తీక వియాన్సీ, దక్షిత, సాయి శ్రీ తమ ప్రతిభతో విశేష ప్రశంసలు అందుకున్నారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యం సభలోని ప్రేక్షకులను అలరించడమే కాకుండా, న్యాయనిర్ణేతల ప్రశంసలు కూడా పొందింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బొగేల కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు వాండ్రాసి సతీష్, నృత్య శిక్షకురాలు రజినిని, అలాగే ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చిన్నారుల ప్రతిభ పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చిందని వారు పేర్కొన్నారు.

